ఖాతాల్లో జమకాని బోనస్

● డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

తరిగొప్పుల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్లు విక్రయించిగా రావాల్సిన బోనస్ డబ్బులు నెల రోజులైనా తమ ఖాతాల్లో జమకాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో కొందరు రైతులు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించారు. ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచినా బోనస్ డబ్బులు కొందరికి రాలేదు. వాటి కోసం సదరు రైతులు ఐకేపీ, పీఏసీఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండల పరిధిలో అక్కరాజుపల్లి, పోతారం గ్రామాల్లో ఐకేపీ, మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. పోతారం, అక్కరాజుపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 25 మంది రైతుల వద్ద 1,862 బస్తాలు(744.8 క్వింటాళ్లు), మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం 39 మంది రైతుల వద్ద 3,998 బస్తాల(1,599 క్వింటాళ్లు) సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో కొందరు రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ డబ్బులు జమకాగా, పోతారం, అక్కరాజుపల్లి చెందిన రైతులు మల్యాల రాజు, సుంకు శ్రీనివాస్, బత్తుల సిద్ధులు, ఎండబట్ల కుమారస్వామి, ల్యాగల రవి, సుంకు రాజు, బొమ్మెన కనకరాజు, పాకనాటి రాజమ్మలకు ధాన్యం విక్రయించి నెల గడిచినా నేటికి బోనస్ డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుల యాదగిరికి రూ.20 వేలు, సుంకు రాజుకు రూ.9 వేలు, సుంకు శ్రీనివాస్‌కు రూ.18,500 రావాలని తెలిపారు. ప్రభుత్వం బోనస్ ఇస్తామంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించామని, బియ్యం చేసి అమ్మినా డబ్బులు చేతికి వచ్చేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తమకు రావాల్సిన బోనస్ డబ్బులు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం(ఫైల్)

బోనస్ డబ్బులు రాలేదు..



నవంబర్ 24వ తేదీన మండలకేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో 40 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. ప్రభుత్వ మద్దతు ధర డబ్బులు ఖాతాలో జమచేశారు. బోనస్ రూ.20 వేలు డబ్బులు రావాలి. పీఏసీఎస్ సిబ్బందిని ఎప్పుడు అడిగిన నేరుగా మీ బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తుంది అంటున్నారు. వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలి.

\- కందుల యాదగిరి, రైతు, పోతారం

బియ్యం చేసి అమ్మినా డబ్బులు వచ్చేవి..



బియ్యం చేసి అమ్మినా చేతికి డబ్బులు వచ్చేవి. ఐకేపీ సెంటర్‌లో 18 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. నేటికి రూ.9 వేలు బోనస్ డబ్బులు రాలేదు. పెట్టుబడికి అప్పు చేయాల్సి వస్తోంది. ఇటు రైతు భరోసా డబ్బులు కూడా జమకాలేదు.

\- సుంకు రాజు, రైతు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం


స్టేషన్‌ఘన్‌పూర్: చాగల్లు పాఠశాలలో బాలికలతో ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం, చదవనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తల్లులు, బాలికలను సన్మానించారు.

ఆర్టిజన్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్

జనగామ: ఆర్టిజన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సుంచు విజేందర్ దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టిజన్లను రెగ్యులర్ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఆర్టిజన్లను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ప్రభాకర్, యాకూబ్, సురేష్, వెంకన్న, సిద్ధులు, తిరుపతి పాల్గొన్నారు.


దీక్షను విరమింపజేస్తున్న విజేందర్

క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో బబ్బూరి మణికాంత్ తన తండ్రి అశోక్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలు జఫర్‌గఢ్(ప్రథమ), కోనాయిచలం(ద్వితీయ) జట్లకు మణికాంత్ బహుమతిలో పాటు పారితోషికాన్ని అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భిక్షపతి, మాజీ ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్లు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీహరి

క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్



బచ్చన్నపేట: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. కాగా, ఈనెల 26న రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్‌హోం తేనీటి విందుకు ఆహ్వానించినట్లు నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట త్రిపుర రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల బాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన దండెంపల్లి స్వరూప గుండెపోటుతో మృతి చెందింది. కాగా, శుక్రవారం కొడకండ్ల బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల సాయం అందజేశారు. ప్రసన్నకుమార్, మమతరాణి, సంధ్య, అక్బర్, అశోక్, రాజు, అరుణ్‌గోపాల్, రవి ఉన్నారు.

అభినందనీయం

లింగాలఘణపురం: పేద విద్యార్థులకు సేవ చేయాలనే భావన కలిగి ఉండడం అభినందనీయమని ఎంఈఓ విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగారం యుపీఎస్‌లో ఇటీవల పదవిపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు సంధ్య పాఠశాలలోని 36 మంది విద్యార్థులకు షూష్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధవిలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎం మల్లికార్జున్, అమ్మ ఆదర్శకమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.
న్న విద్యార్థులు, ఎంఈఓ తదితరులు

'కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి'

నర్మెట: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, ఇందిరమ్మ గరీబీ హటావో నినాదం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వార్థప్రయోజనాల కోసం గత ప్రభుత్వాలు బడుగుల అభ్యున్నతిని తుంగలో తొక్కాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కూకట్ల చంద్రమౌళి, యసర్ల అంజయ్య పాల్గొన్నారు.

రంగోలి పోటీల్లో పెంబర్తి విద్యార్థి ప్రతిభ



జనగామ: జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని జనగామ మండలం పెంబర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రంగోలి పోటీల్లో బాలికా సాధికారత, సంక్షేమం, నాయకత్వ పటిమను ప్రతిభింబించేలా 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.వినూత్న వేసిన ముగ్గు జిల్లాకు సెలెక్ట్ చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా చేతుల మీదుగా విద్యార్థినికి ప్రశంసా పత్రం, బహుమతిని అందించారు. హెచ్ఎం డాక్టర్ జి.నాగరాణి, ఏఆర్‌టీ ఎస్ వసంత, కాలూరి వసంత పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో..



పాలకుర్తిటౌన్: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో పాలకుర్తి సిద్ధార్థ హైస్కూల్ టెన్త్ విద్యార్థి ఆర్.సంజయ్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యార్థికి బహుమతి అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ ఊర్మిళ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు సాయం

పాలకుర్తిటౌన్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. సదరు క్రీడల నిర్వహణకు పాలకుర్తి మాజీ వార్డు సభ్యుడు ఎడవెల్లి సోంమల్లయ్య రూ.10 వేల సాయం అందజేశారు.

ప్రతీ దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్ చేయాలి

● అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి/జఫర్‌గఢ్: ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్ ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి తగిన సూచనలు అందించారు. ఆయన వెంట తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు తదితరులు ఉన్నారు.


ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్

విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

జఫర్‌గఢ్/చిల్పూరు/బచ్చన్నపేట: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే చిల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించగా మండల కేంద్రానికి చెందిన రుచిత ప్రథమ స్థానం, రాజవరం కేజీబీవీ విద్యార్థిని భవ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి తహసీల్దార్ సరస్వతి, ఎంఈఓ గోవర్ధన్, హెచ్ఎంలు బహుమతులను అందజేశారు. కాగా, బచ్చన్నపేట ఎంఆర్‌సీ భవనంలో నిర్వహించిన ఓటరు దినోత్సవంలో ఎంఈఓ వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఓటు విలువను ప్రతీఒక్కరికి తెలియజేయాలన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. హామీలు నెరవేర్చాలని మండల కేంద్రంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు రాజయ్య హాజరై మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజయ్య బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహేందర్‌రెడ్డి, రవి, బుచ్చయ్య, శంకర్, కుమార్, వరుణ్, నజీర్, శ్రీధర్, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గారడీచేసే గ్రామసభలు తగవు


మాట్లాడుతున్న దయాకర్‌రావు

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఏడాది పాలనలో ఘోరవైఫల్యం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజల్ని గారడీచేసేందుకు తలపెట్టిన గ్రామ సభలు తగవని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శుక్రవారం మండలంలోని సింగరాజుపల్లిలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సర్వేలు, గ్రామ సభల పేరిట తాత్సారం చేసే కుట్రలు తప్ప ఆచరణాత్మకంగా అమలు చేసేది లేదన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయాకర్, రవి, మాజీ ఎంపీపీ సోమన్న, ఏల సోమసుందర్, రమేష్‌రెడ్డి, విజయ్, కృష్ణమూర్తి, కిష్టయ్య, మధు, సోమయ్య, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.

రాజయ్య, పల్లా పద్ధతి మార్చుకోండి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అడ్డగోలుగా విమర్శలు చేయడం మూర్ఖత్వమని.. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లా, రాజయ్యలు ఉనికి కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాసన్‌పల్లి లింగాజీ, బొనాసి క్రాంతికుమార్, కావటి భాస్కర్‌యాదవ్, ఎండీ బాసుమియా, మంద రమేష్, గొరిగ రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంబాబు

'సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే చొరవ'

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీలకు అనుగుణంగా అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, ఎల్లయ్య, వెంకటయ్య, కోటేశ్వర్, ఎలిషన్, అజయ్‌రెడ్డి, కృష్ణమూర్తి, కిషన్‌రాజ్, చింత జాకబ్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ పట్టణ కమిటీ

జనగామ: నాయీబ్రాహ్మణ పట్టణ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎలకంటి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యశ్వంతాపూర్ ఎల్లమ్మ గుడి సమీపంలో కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్లి గణపతి, కోశాధికారిగా దాచేపల్లి కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కడింగుల సంజీవ్, ఉపాధ్యక్షులుగా కడింగుల భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కడింగుల శంకర్, కోడపాక భాస్కర్ రామ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలందరికీ సంక్షేమ పథకాలు



జనగామ: పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం చివరి రోజు గ్రామ సభలను పురస్కరించుకుని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 22, 23, 25, 26, 27, 28, 29, 30 వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేడ శ్రీనివాస్, రంగరాజు ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

జనగామ రూరల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి జీవీ శ్రీనివాస్ పాల్గొని డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కానిస్టేబుల్ వెంకటేష్, సమద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన

పాలకుర్తిటౌన్: రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని కార్మెల్ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో లయన్ ఎస్‌టీ కోఆర్డినేటర్ రేపూరి రమణారెడ్డి సహకారంతో 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనిల్‌కుమార్, ఉపేందర్, ప్రదీప్, రాజు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చిల్పూరు: ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ అన్నారు. మండలంలోని ఫత్తేపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జంతు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఎం సరోజన కరపత్రాలను ఆవిష్కరించారు.

బెంచీలు, వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ



జనగామ: ఐడీబీఐ జనగామ శాఖ(సీఎస్సార్ ఇనిషియేటివ్స్) సహకారంతో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 20 బెంచీలు, వాటర్ ప్యూరిఫయర్‌ను ఐడీబీఐ రిజియనల్ మేనేజర్ రవికాంత్‌శెట్టి శుక్రవారం బహూకరించారు. డీఈఓ రమేశ్, ఏఎంఓ శ్రీనివాస్,ఎంఈఓ రాజేందర్, జనగామ శాఖ మేనేజర్ రమేష్, కాంప్లెక్స్ ఇంచార్జ్ హెచ్ఎం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎంతోనే పేద ప్రజల సమస్యల పరిష్కారం

పాలకుర్తిటౌన్: సీపీఎంతోనే పేద ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ అన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలోని ఐలమ్మ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

వ్యక్తి రిమాండ్

జఫర్‌గఢ్ : ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అసభ్య పదజాలంతో వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేసిన కుక్కల పరశురాములును శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్‌రావు, స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ వర్ధన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన పరశురాములు ఈ నెల 21వ తేదీన ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు దుర్భాషలాడుతూ అసభ్యపదజాలతో వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల 22వ తేదీన ఎస్సై రామ్‌చరణ్.. పరశురాములపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, పరశురాములును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ హైవే బైపాస్ రోడ్డుపై అండర పాస్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రశాంత్, మహేందర్, అంజమ్మ, సుగుణ, లక్ష్మి ఉన్నారు.

తాటిచెట్టు నుంచి పడి గీత కార్మికుడి మృతి

జనగామ రూరల్: మండలంలోని పసరమడ్లలో శుక్రవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు నుంచి పడి గీత కార్మికుడు ఆరె ఐలయ్య (69) మృతి చెందాడు. తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని విలపించారు. మృతుడికి ఒక్కడే కుమారుడు ఉండగా.. మూడేళ్ల క్రితం అతడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఐలయ్య మృతితో కుటుంబం రోడ్డున పడింది. కేజీకేఎస్ నాయకులు బాల్నె వెంకటయ్య, వెంకటేశ్, సిద్ధయ్య, పర్శరాములు, చిన్న చంద్రమౌళి, పూలమాల వేసి మృతదేహానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సెఫ్టీ మోకులు అందించి గీత కార్మికులను రక్షించాలని వారు కోరారు.

ఉద్రిక్తతల నడుమ ముగిసిన గ్రామసభలు

నర్మెట: మండలకేంద్రంతో పాటు వెల్దండలో చివరిరోజు శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ ప్రజలు.. అధికారులను నిలదీయడం, తమపేర్లు రాలేదంటూ దూసుకు రావడంతో ఉద్రిక్త వాతావరణం నడుమ ముగిశాయి. కాగా లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా లేదని ఏకపక్షంగా ఒకే వర్గానికి చెందిన వారి ఎంపికలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు అధికారులను నిలదీశారు. కాగా, సీఐ అబ్బయ్య తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినా ప్రజలు అధికారులతో వాగ్వావాదానికి దిగడంతో మైకు తీసుకుని సీఐ వారికి నచ్చచెప్పారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ రామానుజాచార్యులు, ఎంపీడీఓ అరవింద్ చౌదరి, ప్రత్యేక అధికారి హౌసింగ్ డీఈ భజరంగ్‌లాల్, ఏఓ మమత, ఎస్సై నగేష్ ఎంఈఓ ఐలయ్య పాల్గొన్నారు.

ఉద్యోగస్తులను ఎలా ఎంపిక చేస్తారు..?

రఘునాథపల్లి: నిడిగొండలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. గ్రామసభలో నాలుగు సంక్షేమ పథకాల ముసాయిదా జాబితా చదువుతుండగా.. అర్హులకు జాబితాలో చోటివ్వకుండా ఉద్యోగస్తులు, ధనికులకు, నాయకులకు పథకాలు వర్తించేలా ఎలా ఎంపిక చేస్తారని పంచాయతీ కార్యదర్శి మధును గ్రామస్తులు నిలదీశారు. దీంతో సభలో గందరగోళంగా మారడంతో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ గ్రామస్తులను సముదాయించినా జాబితా తప్పులతడకగా ఉందదాగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఈ జాబితా ఫైనల్ కాదని, అర్హులుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయినా వినక పోవడంతో అర్ధాంతరంగా సభ ముగించారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: మండలకేంద్రంతోపాటు సోలిపూర్, వాచ్యా తండాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జాబితాపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగేశ్వరచారి, ఏఓ మనోహిత్ విక్రమరావు, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసు పహారాలో..

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వ పథకాల కోసం మండలంలోని శివునిపల్లి, సముద్రాల గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు ఆద్యంతం రసాభాసగా జరిగాయి. శివునిపల్లిలో గ్రామసభకు ముఖ్య అతిథిగా డీపీఓ, మండల ప్రత్యేక అధికారి స్వరూపరాణి హాజరయ్యారు. గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను అధికారులు చదువుతుండగా గ్రామస్తులు నిరసన తెలిపారు. గతంలో ఇళ్లు వచ్చిన వారికి, ఉద్యోగులు, వ్యాపారస్తుల పేర్లు ఉన్నాయని అధికారులతో వాగ్వావాదానికి దిగారు. సభ రసాభాసాగా జరుగగా సీఐ జి.వేణు ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలను అదుపుచేశారు. పోలీసు పహారాలో గ్రామసభను కొనసాగించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ ప్రజలు సంయమనం పాటించాలని, ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా అందించాలన్నారు. శివునిపల్లిలో గ్రామ సభ జెడ్పీఎస్ఎస్‌లో నిర్వహించగా విద్యార్థులకు అంతరాయం ఏర్పడింది.


నర్మెట: ఆందోళన చేస్తున్న ప్రజలకు నచ్చచెబుతున్న పోలీసులు

దేవరుప్పులలో..

దేవరుప్పుల: ఏ ఊరులో గ్రామ సభలు నిర్వహించినా తాము సంక్షేమ పథకాలకు అర్హులం కామా అంటూ అధికార యంత్రాంగాన్ని నిలదీతలతో ఎట్టకేలకు గ్రామ సభలు ముగిశాయి. మున్సహాడ్, లక్ష్మణ్‌తండా, పడమటితండా(డీ), చౌడూరు, పొట్టిగుట్టతండా, లాకావత్ తండా(తూర్పు), దుబ్బతండా, పెద్దమడూరు గ్రామ సభల్లో లోపభూయిష్టంగా సర్వే చేసి అసలైన అర్హులకు మొండిచేయి చూపారని ఆరోపిస్తూ ఆందోళన చేశారు.

గొడవలు సరికాదు: డీసీపీ

చిల్పూరు: సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం అధికారులతో గ్రామ సభలు నిర్వహిస్తుంటే కావాలనే కొందరు గొడవలకు దిగడం సరికాదని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. మండలంలోని తీగలతండాలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభను ఆయన సందర్శించారు. అనంతరం చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి మాధవీలత, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఎంపీఓ మధుసూదన్, ఈసీ కిరణ్‌కుమార్ ఉన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. సభల్లో కొందరు లబ్ధిదారులు తమకు ఇళ్లు మంజూరు కాలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాబితాలో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలోని లక్ష్మాపూర్, దబ్బుగుంటపల్లి, గోపాల్‌నగర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు ముగిశాయి. మండల స్పెషలాఫీసర్ రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్, ఏఓ విద్యాకర్‌రెడ్డి పాల్గొన్నారు.